# జలరక్కసి

ఎందుకమ్మా ఇంతపని చేసావు ? పొట్టనిండా తిండిపెట్టి జోకొట్టి బుజ్జగించాల్సిన చల్లని తల్లిని ఏం చేసారని, నీ బిడ్డల కడుపుగొట్టి, నెత్తిన మొట్టి, బొక్కబోర్లా దోసావు ?

నోటి దగ్గరున్న కూటిని ఎందుకు కాలదన్నావు ?

నీ విశాల బాహువుల విన్యాసంతో నీ పడివడి నడకల ఉధృతంతో ఎందుకు నీ బిడ్డల్ని సర్వనాశనం చేసావు ?

నీ అరుణారుణ నేత్రాలతో విస్ఫులింగాలను ప్రసరింపజేసి ఎందుకు నీ సంతానాన్ని దగ్ధం చేసావు ?

దెబ్బతిన్న త్రాచులా, పగపట్టిన పాములా, బుసకొడుతూ, గసపెడుతూ ఎందుకు అంత భయంకరంగా ప్రయాణం చేసావు ?

నీ చల్లని నీటి ఆధారంతో సస్యశ్యామలంగా పంటలు పండించుకొంటూ, కడుపు నింపుకొని నీ పక్కలో వెచ్చగా నిద్రించే నీ బిడ్డల్ని ఎందుకు ఎడా పెడా వీపు చరచి వారి కూటినేకాక గూటినీ, గుడ్డనూ నేల పాలు చేసావు ?

చంటిబిడ్డలు ఆర్తనాదాలు విన్నావా !
ముసలివాళ్ళ మృత్యుకేకలు గమనించావా ! !
మాతృమూర్తుల రోదనలు నీ చెవి కొచ్చాయా ! ! !
బీద, బిక్కి, మధ్యతరగతి ప్రజల హాహాకారాలు ఆకాశాన్ని తాకుతున్నాయే ?

అవి కూడా నీకు వినిపించలేదా !

అమ్మా గోదావరి ఎందుకమ్మా ఈ పని చేసావు!

ఒక్కసారి కళ్ళెత్తి చూడు ఏం జరిగిందో?

గుడెసెలూ, కొట్టాలు కొట్టుకుపోయాయి.

పెంకుటిల్లు, డాబాలు నేల కూలాయి.

భవనాలు శిథిలమైపోయాయి.

పంటపొలాలు విశాలమైన సాగరాలయ్యాయి.

నగరాలు నీటిలో తేలాడుతున్నాయి.

నగర వీధులు నదీ ప్రవాహాలయ్యాయి.

పల్లెటూళ్ళు ఆనవాలు లేకుండాపోయాయి.

చెరువులు తెగాయి. కాలువలు గండ్లుపడ్డాయి.

ప్రాజెక్టులు బ్రద్దలయ్యాయి.

దేవాలయ గాలిగోపుర శిఖరాలు అనంతమైన జలరాశి మీద తేలాడే తెల్లని హంసల్లా కనిపిస్తున్నాయి.

పొడవుగా సాగిన తారురోడ్డు ముక్కలు, ముక్కలుగా తెగింది.

సమాంతరంగా ఉండే రైలుపట్టాలు రాక్షసుడు మెలిపెట్టినట్లు ఒకదాన్నొకటి చుట్టుకొని తెగిపోయాయి.

ప్రభుత్వ ఆఫీసుల్లోని కాగితాలు నిండుగా నీరు పీల్చుకుని ఉబ్బిపోయాయి.

ప్రజలు కొండలపైకెక్కి తాటికాయలు, దుంపలు తిని ప్రాణాలు బిగపట్టుకున్నారు.

దేవాలయ మెట్లమీద, ఎద్దుబండ్లమీద ప్రసవించారు ఆడపడుచులు.

శతృత్వం మరచి మనుషులతోబాటు పాములు, ముంగిసలు, పక్షులు ఒకే చెట్టుమీద చీకటి రాత్రులు గడిపాయి.

కొన్ని లక్షల ప్రజలు నిరాశ్రయులయ్యారు.

కొన్ని వందల కోట్ల ఆస్తి నష్టం జరిగింది.

జననీ గోదావరీ ఆటు చూడు....

ఏం చేసారని అన్ని వందల మానవ కళేబరాలు నీటిమీద తేలాడుతున్నాయి.

ఏం చేశాయని ఆ పశువుల డొక్కల మాంసం నక్కలకు, కుక్కలకు ఆహారం అయ్యాయి.

చెట్టు, చేమలు ఏం చేయాలని వ్రేళ్ళు పైకెత్తుకొని ఆకాశంవంక చూస్తున్నాయి.

ఒక్కసారి అలా చూడు. ఆ జన ప్రవాహాన్ని....

బీదవాడు, భాగ్యవంతుడు సమానమైనారు.

దరిద్రుడు, దానకర్ణుడు ఒకటైనారు.

నెత్తిన మూట పెట్టుకొని, భుజాన మూడేళ్ళ పిల్లవాడ్ని ఎక్కించుకొని, ఎడమ చేత్తో భార్యను పట్టుకొని కుడిచేతిలో కర్రతో నడుములోతు నీళ్ళలో దారి వెతుక్కుంటూ నడుస్తున్నాడు ఓ మధ్య వయస్కుడు.

భయంతో గుండెలు జలదరిస్తుండగా, చలికి శరీరం కొకర్లుపోతుండగా, ఆకలికి తాళలేక అరచి అరచి సొమ్మసిల్లిపోయి జోలెలా కట్టుకున్న గుడ్డలోని బిడ్డను అదుముకుంటూ నడుస్తోంది ఆమె.

ఆమె వెనుక కొద్దిదూరంలో ఆమె పెద్దకొడుకు రొమ్ములోతు నీళ్ళల్లో నడుస్తూ తన ముందున్న ఆవు పెయ్యను అదిలిస్తున్నాడు. ఆ ఆవు పెయ్యమీద గోచిపాత కూడా వంటిమీదలేని ఎనిమిదేళ్ళ ఆమె రెండవ కొడుకు వెన్నుకు అంటుకుపోయిన డొక్కలతో ఏడ్చి, ఏడ్చి ఇంకా ఏడిస్తే చచ్చిపోతానేమోనని భయంతో చుట్టూ సముద్రంలా ఉన్న నీటి ప్రవాహాన్ని గుడ్లప్పగించి వెలవెలాపోయి చూస్తున్నాడు.

ఇకపోతే ఆ ఆవుపెయ్య కథ ఇంకా విషాదకరమయింది. అది మూడు రోజులక్రితం మొదలైన తుఫానులో భయంకరమైన అనుభవాన్ని చవి చూసింది. ఆ వర్షంలోనే దాని తల్లి బంగారంలాంటి కోడెదూడను ఈనింది. చుట్టూ వర్షం పడుతూంటే కొట్టాంలో పడుకొని తన పెద్ద పెద్ద కళ్ళతో తనెరుగని ప్రపంచాన్ని విచిత్రంగా చూస్తూ 'అంబా' 'అంబా' అంటూ అరుస్తోంది దూడ. దాని తల్లి ఆప్యాయంగా మురిసిపోతూ బిడ్డ శరీరాన్ని నాకుతోంది. తల్లీ బిడ్డల అనురాగాన్ని చూస్తున్న ఆవుపెయ్య మురిసిపోయింది. ఇంకో గంటలో నా తమ్ముడు నడుస్తూ నా దగ్గర కొస్తాడుగదా అని మురిసిపోతోంది.

ఇంతలో జరిగిందొక భయంకర సంఘటన. ఉప్పొంగిన గోదావరి ఊరును, చెరువును ఏకంచేస్తూ చెరువు కట్టను తెంచుకొని ఊరిమీద పడింది. ఈ వరద, వరద కొట్టాన్ని అలాగే ఎత్తుకుపోయింది. అందులోని ఆ ఆవుపెయ్య, దాని తమ్ముడు, దాని తల్లి మూడూ కొట్టుకు పోయాయి. యౌవ్వనంలో ఆవుపెయ్య ఎలాగో ఈదీ ఎత్తయిన స్థలాన్ని ఎక్కి తన ప్రాణాల్ని కాపాడుకొంది. కాని దానికి తెలుసు. బిడ్డను ప్రసవించి అలసటగా ఉన్న తల్లి, అప్పుడే కళ్ళు తెరచిన ఏ పాపం ఎరుగని తన తమ్ముడు తిరిగి తనను చేరరని, ఎక్కడో శిథిల గోడల క్రింద సమాధి అయిపోయి ఉంటారని. అలాగే కన్నీరు కారుస్తూ ఉండి పోయింది. తన యజమాని తనను వెతుక్కుంటూ వచ్చేంతవరకూ.

ఆ వెనుకనే రెండు వెదురు బొంగులకు దుప్పటి చివరలతో బిగించి కట్టిన డోలీలో కూర్చుని ప్రయాణిస్తున్నాడొక శాదీ శతాదీక వృద్ధుడు. వృద్ధాప్యపు భారంతో శరీరం ఎండిపోయి ఉంది. కళ్ళు రాయలసీమ బావుల్లా ఉన్నాయి. నుదుటిమీద ఎన్నో ముడతలు. ఒక్కో ముడతా అతని ఒక్కో దశాబ్దపు అనుభవాల్ని చెబుతోంది. తన వందేళ్ళ జీవితంలో ఎన్నో విషాదాలను, భయంకర సంఘటల్ని ఎదుర్కొన్న

ఆ ముదుసలి ఇలాంటి పరిస్థితిని ఊహించనైనా ఊహించలేదు. తన కళ్ళ ముందే తన భార్య విసరేసిన బంతిలా ప్రవాహంలో కొట్టుకుపోతుంటే కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు. ఆ సమయంలో తను దైవవశాత్తు తన కొడుకుల చేత రక్షింపబడ్డాడు. కాని వాళ్ళు తల్లిని రక్షించుకోలేకపోయారు. 'నేను బోయి అది బ్రతికున్నా బాగుణ్ణు' అనుకున్నాడు ముదుసలి బాధగా.

అతని ప్రక్కనే అతని నలుగురు మనవళ్ళు బెరడు ఊడబెరికిన చెట్లలా నగ్నంగా కూర్చుని ఉన్నారు. వాళ్ళముందు ఒక కందిపప్పు డబ్బా ఉంది. అందులోని కందిపప్పు తింటూ ఉప్పు కూడా దొరక్కుండా చేసిన వరద నీటిని విచిత్రంగా చూస్తున్నారు.

డోలీని మోస్తున్న వాళ్ళు ఆ పిల్లల తల్లిదండ్రులూ, ఆ ముదుసలి కొడుకులు, కోడళ్ళు. మగవాళ్ళు పంచెలు, ఆడవాళ్ళు చీరలు ఎగగట్టి గోచీ పెట్టారు. ముందువైపు పెద్దకోడలు, పెద్దకొడుకు డోలీని మోస్తుంటే వెనుకవైపు చిన్నకొడుకు, చిన్నకోడలు డోలీని మోస్తున్నారు.

వాళ్ళ గుండెల్లో ముసలామెను పోగొట్టుకున్న దుఃఖం ఒకవైపు, ముసలాయన్ని, పిల్లల్ని రక్షించుకోవాలన్న తపన రెండోవైపు రెండు వైపులా పదునున్న కత్తిలా వాళ్ళ గుండెల్ని కోస్తూ ఉంది. పైన కూర్చున్న ముసలాయనకు తను ప్రయాణించేది సురక్షిత ప్రదేశానికన్నట్లు గాక, శ్మశానానికి సజీవంగా వెడుతున్నట్లుగా ఉంది.

ఆ డోలీ వెనుకనే నడుస్తున్నాడొక పొందుడు. అతను తను ఊళ్ళో ఇంటిముందు బయట మంచమీద పడుకొని నిద్రపోతుండగా అర్ధరాత్రి వచ్చిన ప్రవాహం మంచంతో సహా కొట్టుకుపోయింది. చల్లని నీళ్ళలో మునిగి లేచేసరికి అతను వాస్తవంలోకి వచ్చాడు. చుట్టూ అంతా చీకటి. తను ఎక్కడ ఉన్నాడో ఏమీ తెలియదు. అయితే తను మాత్రం ప్రవాహంలో మునుగుతూ తేలుతూ కొట్టుకుపోతున్నాడని తెలుస్తూ ఉంది. ఆ భయంకర అనుభవంలో కూడా అతనికి తన భార్యా పిల్లలు గుర్తుకొచ్చి

విపరీతమైన భయం పుట్టింది. వాళ్ళు కూడా తనలాగే కొట్టుకుపోయుంటారు. అయినా తనలాగే వాళ్ళు బ్రతికుంటారని నమ్మకం లేదు. గుండెల్ని జలదరించే ఆ సత్యం గుర్తు తెచ్చుకొనే సమయానికి అతనో సుడిగుండంలో పడ్డాడు. గిర్రున బొంగరంలా తిప్పిన సుడి అతని అదృష్టం బాగుండి దూరంగా విసరికొట్టింది. మళ్ళీ ప్రవాహంలో మునిగి తేలుతున్న అతని శరీరానికి ఆ చీకట్లోనే కొద్దిపాటి వెడల్పున్న బల్ల చెక్క తగిలింది. ఎగిరి దానిపైన కూర్చున్నాడు. చేతులతో తడిమి చూసాడు. బాగా తడిసి నాని ఉండడంతో అది చల్లగా ఉంది. ప్రవాహం ఒరిపిడికి అది అటూ ఇటూ ఊగుతోంది. దాని కుదుపులకు అనుగుణంగా శరీరాన్ని బాలెన్సు చేసుకుంటూ ప్రయాణం చేస్తున్నాడతను.

అలా కొద్దిసేపు ప్రయాణించిన అతనికి అక్కడో కుదుపు తగిలి ప్రయాణం ఇంకోవైపుకు మరలింది. అతని ప్రక్కనే భయంకరమైన 'హా! హా!' కారాలు వినిపిస్తున్నాయి. 'గోవిందా! గోవిందా!' అని అరుస్తూ ప్రవాహం వేగంలో కొట్టుకుపోతున్న అనంత జనసమూహం. అక్కడో ఊరుందని ప్రవాహం ఆ ఊరిమీద పడిందని గ్రహించాడతను. తెల్లవారేసరికి అతను దాదాపు పాతిక మైళ్ళు ప్రయాణించి ఒక చెట్టు కొమ్మల్లో చిక్కుకుపోయాడు. అప్పుడు తెలిసింది అతనికి తనింత సేపు ప్రయాణం చేసింది బల్ల చెక్క మీద కాదని ఒక గేదె మృతకళేబరం మీదని. కాని తప్పదు. మూడోరోజు వరద ప్రవాహం తగ్గేంతవరకు అతను అదే కళేబరం మీద కూర్చుని ఆ దుర్గంధాన్ని భరిస్తూ గడిపాడు. తరువాత చెట్టుదిగి జనంలో కలిసాడు.

ఇకపోతే అతని వెనుకనే నడిచివచ్చే భార్యాభర్తలు కల్లు వ్యాపారస్తులు. భర్త రెండు చేతుల్లో రెండు కోళ్ళున్నాయి. అవి కాళ్ళు కట్టివేయబడి తలక్రిందులుగా వ్రేలాడుతున్నాయి. వాటి తలలు నీటిలో మునగకుండా ఎత్తిపెట్టి నడుస్తున్నాడు. వారికి మిగిలింది అవే. అతని భార్య,

వెనుకనే నెత్తిన బుట్ట పెట్టుకుని మాటిమాటికి ముక్కు చీదుతూ నడుస్తోంది. వరద ప్రవాహానికి ముందురోజు, తాము గత ఆయిదేళ్లుగా పొట్ట కట్టుకుని సంపాదించి బాంకులో దాచుకున్న పదిహేను వేలు పొలం కొందామని వరదకు ముందురోజే తెచ్చి ఇంట్లో పెట్టుకున్నారు కాని ఇప్పుడు డబ్బుతో పాటు ఇల్లు కూడా కనిపించకుండా పోయింది.

వారి వెనుక విరాగిలా నడిచివస్తున్న వ్యక్తి ఒక భూకామందు. వంద ఎకరాల ఆస్తికి వారసుడు. అతని ఇంట్లో లక్ష్మీదేవి తాండవించేది. ఆ ప్రాంతంలో దానకర్ణుడని పేరుగాంచినవాడు. ఈనాడు అతను లక్ష్మిని లక్ష్మిలాంటి భార్యను, ముద్దుబిడ్డలను పోగొట్టుకొని విలపిస్తూ కూడా ఒంటిమీద చొక్కాను కూడా దానం చేసిన గొప్ప మనసుగల దరిద్రుడాయన.

అతని వెనుకనే వస్తున్నాడొక బిచ్చగాడు. అతనికి ఒంటిమీద చొక్కా ఉంది. మొలమీద పంచెలేదు. గోచి మాత్రమే ఉంది. ఆ చొక్కా కూడా ముందు నడిచే ఆ సామి ఇచ్చినదే. ఆ ముష్టివాడి ఆస్తి ఏమీపోలేదు. వాడు ఆడుక్కొనే బొచ్చె, వెదురుకర్ర వాడి దగ్గరనే ఉన్నాయి. కాని వాడు శోకాలుపెట్టి ఏడుస్తూ వస్తున్నాడు. కారణం వాడికి తెలుసు. ఆ సాములు బాగుంటేనే తన బొచ్చెలో ఇంత ముద్దపడేది. అందుకే వాడు తన కొరకు గాక ఇతరుల కొంపలు కొట్టుకుపోయినందుకు కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు.

అలా ప్రవాహంలా సురక్షిత ప్రదేశాలకు కదలివెళ్ళే జన సందోహాన్ని కదిలిస్తే ఒక్కొక్కరు ఒక్కొక్క కఠోర విషాద విభ్రాంతి కరమైన కథ చెప్పగలరు.

సముద్రంలా పరచుకున్న నీటిమీద వెళ్ళుకొచ్చిన మొండిగోడల మధ్య ఎండిపోయిన తాటిబొందును పడవ చేసుకుని తన ఆత్మీయుల

మృతదేహాలను వెతుకుతున్నాడో అభాగ్యుడు. అతనికి తెలియదు నీటిలో నానిన ఏ గోడ కూలినా తనూ ఓ కళేబరంగా మారిపోగలడని.

చుట్టూ నీళ్ళే అయినా త్రాగడానికి చుక్క పనికిరాదు.

ఇవన్నీ బాధాకరమైన వాస్తవాలు....

మనుషులకు మానవత్వం లేదంటారే అటు చూడు తల్లీ!

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు ఎలా దుఃఖభారమైన హృదయాలతో వరద భీభత్సాన్ని పరిశీలిస్తున్నారో చూడు.

ఆకాశంలో పక్షుల్లా తిరుగుతున్న హెలికాప్టర్లు మిట్ట ప్రదేశాల్లో తలదాచుకొన్న ప్రజాసమూహంలోకి ఆహారపు పొట్లాలు విసురుతున్నారు. అధికారులు, సైనికులు నీటిని, వరదను, బురదను లెక్కచేయకుండా ప్రజలను సురక్షిత ప్రదేశాలకు చేర్చి సహాయ శిబిరాలలో వారికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వచ్ఛంద సేవాసంస్థలు తాము వరదతాకిడిలేని గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ దండిన చందాలను, వస్తుసామగ్రిని బాధితులకు నిర్విరామంగా పంచుతూ ఉన్నారు.

వైద్యబృందాలు కలరా మొదలైన అంటువ్యాధులు ప్రబలకుండా నిర్విరామంగా ప్రజలకు ఇంజెక్షన్లు చేస్తూ ఆరోగ్య సలహా లిస్తున్నారు.

దేశం నలుమూలలనుంచి దాతలు తమ విరాళాలను లెక్కకుమించి పంపుతున్నారు. అంతెందుకు ప్రభుత్వ ఉద్యోగులు ఒకరోజు జీతమిస్తే, జైళ్ళలో మ్రగ్గుతున్న ఖైదీలు తమ ఒకపూట భోజనం మానుకుని ఆ మొత్తం విలువను పంపారు.

ఎన్యుమరేటర్లు అన్నివైపులా తిరుగుతూ జరిగిన నష్టాన్ని వివిధ కోణాల్లో వ్యక్తిగత అంచనాలు వేస్తున్నారు.

బాధితులకు ప్రభుత్వం శాశ్వత గృహనిర్మాణానికి పథకాలు వేస్తోంది.

జాతీయ బాంకులు ఋణాలు ఇచ్చేందుకు పోటీపడి ముందుకు వస్తున్నాయి.

యుద్ధ ప్రాతిపదికమీద తెగిపోయిన గండ్లు, కొట్టుకుపోయిన రోడ్లు పూడుస్తున్నారు.

ఎన్ని నష్టాలు కలిగించాను నేను, అని వికటాట్టహాసం చేస్తున్నావా తల్లీ.

ఇక నీ ఆటలు సాగనివ్వం.

మా శక్తి నీకు తెలుసా.

ఆరడుగుల పొడవున్న ఈ మానవుడు అంతరిక్షంలో కొన్ని వందల లక్షల కోట్ల దూరం గ్రహాంతరయానం చేసి కోటానుకోట్ల గ్రహాలను తన సార్వభౌమత్వం క్రిందికి తెచ్చుకోబోతున్నాడు.

అటువంటిది నువ్వెంత ?

చలిచీమల చేతిలో చిక్కిన బలవంతమైన సర్పం చివరకు ఏమయ్యింది ?

బలహీనంగా ఉన్న గడ్డిపోచలు ఒకపై బలవంతమైన ఏనుగును బంధించలేదా !

అలాంటప్పుడు నువ్వనగా ఎంత ?

అందుకే మేమంతా ఒకపై,

భవిష్యత్తులో నీ ఆటలు సాగకుండా, నీ పెడరెక్కలు విరిచి కట్టేందుకు నీ ప్రవాహానికి అటూ యిటూ బలమైన గట్లు కట్టబోతున్నాం.

నీ ఉధృతమైన పరుగును అరికట్టేందుకు, నీ కాళ్ళు విరగ్గొట్టడానికి ప్రతి పాతికమైళ్ళ కొక డామ్ కట్టబోతున్నాం.

అప్పుడు నువ్వేం చేస్తావ్ ?

ఏమీ చెయ్యలేవు.

నక్కి, నక్కి, వంగి, వంగి భయం భయంగా ప్రవహిస్తావు. గతాన్ని తలచుకొంటూ ఫలితాన్ని అనుభవిస్తావు.

కొన్ని వందల మందిని పొట్టన పెట్టుకున్న నీకు, కొన్ని లక్షల మందిని నిరాశ్రయుల్ని చేసిన నీకు కొన్ని వందల కోట్ల విలువ నష్టాన్ని కలుగజేసిన నీకు ఇదీ తప్పదు.

అందుకే అంటాను నిన్ను....

నువ్వు తల్లివి కాదు.

రక్కసివి !

జల రక్కసివి ! !

***